నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
3 | నిజామాబాద్ మంగళవారం 24 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

## హాస్టల్ నుంచి విద్యార్థి పరార్



బాలుడిని హాస్టల్ సిబ్బందికి అప్పగిస్తున్న పోలీసులు

ఖానాపూర్ టౌన్, సెప్టెంబర్ 23 : ఖానాపూర్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న నిక్షిత్ ఇంటి మీద బెంగతో హాస్టల్ నుంచి పారిపోయాడు. చదువుకోవడం ఇష్టం లేకపోవడంతో సిబ్బందికి తెలియకుండా ఆదివారం రాత్రి పరార్ అయ్యాడు. పట్టణంలోని శాంతినగర్ కాలనీలో సోమవారం వేకువజామున ఏడుస్తూ కనిపించిన బాలుడిని చూసి స్థానికుడు 100 కు డయల్ చేశాడు. బ్లూకోర్టు సిబ్బంది వివరాలు తెలుసుకుని తిరిగి హాస్టల్‌లో అప్పగించారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ జానకీ షర్మిల, సీఐ సైదరావులు అభినందించారు.

## కార్మికులకు ద్రోహం చేస్తున్న కేంద్రం



పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 23 : కార్మిక వర్గానికి కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేస్తున్నదని, నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ సోమవారం నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి లేబర్ కోడ్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి పదేండ్లు అవుతున్నదన్నారు. ఈ కాలమంతా దేశంలో ఉన్న పెట్టుబడిదారులైన కార్పొరేట్, బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం కార్మిక వర్గ శ్రమను దోచుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు గంగాధర్, గంగామణి, విజయలక్ష్మి, లలిత, అనంతరావు పాల్గొన్నారు.

### శాసన మండలిలో నిరుద్యోగుల

# గొంతుకనవుతా..

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆదరించండి..
- విస్తృతంగా పట్టభద్రుల ఓటరు నమోదు
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

ఆదిలాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్యాడ్యుయేట్లు తనను ఆదరించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 34 సంవత్సరాలుగా విద్యారంగంలో ఉన్న తాను వేలాది మంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర వాళ్ల స్కూళ్లు, కళాశాలలకు దీటుగా తెలంగాణ విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించినట్లు వివరించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువత సమస్యలపై తనకు స్పష్టమైన అవగాహన ఉందన్నారు. పట్టభద్రులు తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తమ విద్యాసంస్థల ద్వారా ఏటా 40 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందిస్తున్నామని తెలిపారు. తమ కళాశాలల్లో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. మేధావి వర్గం నుంచి వచ్చిన తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరారు.

### విస్తృతంగా ఓటరు నమోదు

అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 30 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు ఓటరు నమోదు కార్యక్రమం ఉన్నందున ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎన్నికల సంఘం ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేస్తామన్నారు. గ్యాడ్యుయేట్లు తమ ఓటరు, ఆధార్ కార్డులు, ఆధార్ సర్టిఫికేట్లు తీసుకొచ్చి ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఎన్నికల్లో నాలుగు జిల్లాల్లో 5 నుంచి 6 లక్షల మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాలున్నాయన్నారు. గత ఎన్నికల్లో 1.94 లక్షల మంది ఓటర్లు ఉంటే కేవలం 1.04 లక్షల మంది మాత్రమే తమ ఓటును వినియోగించుకున్నారని తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



రోడ్డుపై పాలు పారబోసి ధర్నా చేస్తున్న పాడి రైతులు

# పాల బిల్లులు చెల్లించాల్సిందే..

## రెండున్నర నెలలుగా ఇవ్వకపోవడంతో పాడి రైతుల ధర్నా

- కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్న లబ్ధిదారులు
- ఇచ్చోడలో రోడ్డుపై పాలు పారబోసి నిరసన
- విజయ డెయిరీ పాడి రైతుల ఆందోళన

ఇచ్చోడ, సెప్టెంబర్ 23 : ఇచ్చోడ మండల కేంద్రంలో విజయ డెయిరీకి చెందిన పాడి రైతులు రోడ్డుపై పాలు పారబోసి నిరసన తెలిపారు. సోమవారం దాదాపు 56 మంది రైతులు అరగంట పాటు ధర్నా నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా విజయ డెయిరీకి సంబంధించి బేల, ఆదిలాబాద్, ఉట్నూర్, ఇచ్చోడలలో కేంద్రాలు ఉన్నాయన్నారు. ఉట్నూర్‌లో పాల రైతులకు డబ్బులు చెల్లించకపోవడంతో పాల కేంద్రం మూతబడిందని పేర్కొన్నారు. ఇచ్చోడ మండలకేంద్రంలోని విజయ డైరీలో బోథ్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, నేరడిగొండ, గుడిహత్నూర్, సిరికొండ మండలాలకు చెందిన పాడి రైతులు ఉదయం, సాయంత్రం 56 మంది 250 నుంచి 350 లీటర్ల పాలను సేకరిస్తున్నారని గుర్తు చేశారు. పాల డబ్బులు రాకపోవడంతో బర్రెలు, ఆవులకు మేత, వైద్య ఖర్చులు ఎక్కువ అవడంతో పాటు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు కట్టలేక ఇబ్బంది పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 15 రోజులకోకసారి ప్రభుత్వం పాల బిల్లులు చెల్లించేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రెండు, మూడు నెలలు గడిచినా పాల బిల్లులు రాకపోవడంతో ఇబ్బంది అవుతున్నదని పేర్కొన్నారు. పాల కేంద్రం నిర్వహించే కమిషన్ ఏజెంట్‌కు ఎనిమిది నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో ఆటో చార్జీలు, రూమ్ అద్దె, కరెంట్ బిల్లులు కట్టడం కష్టమవుతుందని పేర్కొన్నారు. విజయ పాల డైరీ కేంద్రాన్ని కూడా మూసివేసే స్థితి వస్తుందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### బిల్లులు ఇవ్వాలి..



నేను ఇచ్చోడ మండల కేంద్రంలోని విజయ డెయిరీ పాల కేంద్రంలో రెండేండ్ల నుంచి రోజు 20 లీటర్ల పాలు విక్రయిస్తున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పటినప్పటి నుంచి రెండున్నర నెలలుగా బిల్లులు రావడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే పక్షం రోజులకోసారి పాల బిల్లులు చెల్లించే వారు. ఇప్పటివరకు నాకు రూ.40 వేలు రావాలి. ప్రజాప్రతినిధులు, అధికారులకు మొర పెట్టుకున్న ఫలితం లేదు.

*- షేక్ సలీం అలీ, పాడి రైతు, బజార్‌హత్నూర్.*

### ఆర్థికంగా అవస్థలు పడుతున్నాం..



మాది గుడిహత్నూర్. ఇచ్చోడ విజయ డైరీలో రోజు 50 లీటర్ల పాలు పోస్తా. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు, మూడు నెలలు అవుతున్న పాల బిల్లులు చెల్లించడం లేదు. అధికారులు ఎన్నోసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదు. దీంతోనే రోడ్డుపై పాలు పారబోసి నిరసన తెలిపాం. ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలి. డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నం.

*- బండేవార్ అశోక్, పాడి రైతు, గుడిహత్నూర్.*

### రూ.3.70 లక్షలు రావాలి..



ఇచ్చోడ మండల కేంద్రంలోని విజయ డెయిరీలో నేను కమిషన్ ఏజెంట్‌గా పని చేస్తున్నా. గ్రామాల్లో తిరిగి పాలు సేకరించి పాల కేంద్రానికి తీసుకొస్తా. లీటర్‌కు రూ.2 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తున్నది. ఈ డబ్బులతోనే ఆటో చార్జీలు, పాల కేంద్రం నిర్వహణ, కరెంటు బిల్లు చెల్లిస్తాం. ఎనిమిది నెలల నుంచి రూ.3.70 లక్షలు రావాలి. ప్రభుత్వం చెల్లించకపోవడంతో పాల కేంద్రం నిర్వహణ ఇబ్బందిగా మారింది. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోతే ఈ కేంద్రం మూతపడుతుంది.

*- శిండే యోగేశ్వర్, కమిషన్ ఏజెంట్, దాబా.*



బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పన చెక్కులను అందజేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

## సాలరీ ప్యాకేజ్ ఇన్సూరెన్స్ అందజేత

- తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారి
- ఇద్దరు కుటుంబ సభ్యులకు మంజూరు
- బాధిత కుటుంబాలకు సహకారం అందిస్తాం : ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, సెప్టెంబర్ 23 : బాధిత కుటుంబ సభ్యులకు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. ఇటీవల విధి నిర్వహణలో ఆర్‌ఎస్‌ఐ మారుతి, కానిస్టేబుల్ మార్కండేయులు మరణించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా పోలీస్ సాలరీ ప్యాకేజీ ఇన్సూరెన్స్ ద్వారా లబ్ధి పొందారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు చెరో రూ.5 లక్షల చొప్పున ఇన్సూరెన్స్ డబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. జిల్లా పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నందు సాలరీ ప్యాకేజ్ అకౌంట్‌లోకి మార్చడం జరిగిందన్నారు. ప్రమాదవశాత్తు, యాక్సిడెంట్, సాధారణంగా సిబ్బంది మరణించినట్లయితే త్వరితగతిన ఇన్సూరెన్స్ కుటుంబ సభ్యులకు అందించి ఉద్దేశంతో పెట్టామన్నారు. సమస్యలకైనా జిల్లా అసోసియేషన్ సభ్యులను జిల్లా పోలీసు ఉన్నతాధికారిని సంప్రదించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్) సురేందర్‌రావు, డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీసీ శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిణి జైస్వాల్ కవిత పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

## అర్జీలకు పరిష్కారం చూపాలి..

ఉట్నూర్, సెప్టెంబర్ 23 : గిరిజనులు పెట్టుకున్న అర్జీలు వెంట వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం స్థానిక పీవో క్యాంపు కార్యాలయంలో గిరిజన దర్బార్ సందర్భంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడుతూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేట్ గ్రామానికి చెందిన వైష్ణవి తనకిపై చదువుల కోసం సాయం కావాలని, జంగుబాయి మారుతిగూడ గ్రామానికి మినీ అంగన్‌వాడీ కేంద్రం కావాలని, ఇంద్రవెల్లి మండలంలోని వడ్‌గాం గ్రామానికి చెందిన సునీత ఉద్యోగం ఇప్పించాలని, దుబ్బగూడ గ్రామానికి చెందిన హనుమంతరావు భూమికి పట్టా ఇప్పించాలని అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏడీఎంహెచ్‌వో మనోహర్, ఏవో దామోదర్, పీహెచ్‌వో సందీప్ కుమార్, జేడీఎం నాగభూషణం, పీసా కో-ఆర్డినేటర్ వసంత్‌రావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల నిరసన

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 23 : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వవద్దని, ప్రభుత్వ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను కార్మికులకు అందించాలన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరి కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించాలన్నారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రం అందించారు.



నిర్మల్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

## ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె



నిరసన తెలుపుతున్న అద్దె బస్సు డ్రైవర్లు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 23 : నిర్మల్ ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు సోమవారం ఉదయం సమ్మెబాట పట్టారు. ఈ సందర్భంగా డిపో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డ్రైవర్లు సమ్మెబాట పట్టగా సమస్యలను పరిష్కరిస్తామని యజమానులు హామీ ఇవ్వగా సమ్మెను విరమించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మసురోద్దీన్, షాపుల్లా ఖాన్, వకీల్, సతీష్ కుమార్, మల్లేశ్, పరుశరాం పాల్గొన్నారు.

## న్యూ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

బోథ్, సెప్టెంబర్ 23 : బోథ్‌లోని న్యూ కాలనీలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో డ్రైన్ పనులు ప్రారంభించాలని, పిచ్చి మొక్కలు తొలిగించాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో కాలనీలో నీరు ఎక్కువగా ఉండేదని, కేసీఆర్ హయాంలోనే తాగునీటి సమస్య తీరిందని కాలనీవాసులు ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన వెంట తాజా మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌లు ఉన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్




ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐటీఐ కళాశాల విద్యార్థులు

## కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ధర్నా

ఎదులాపురం, సెప్టెంబర్ 23 : విద్యారంగ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి శ్రద్ధ వహించడంలేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ అన్నారు. పట్టణంలోని ఐటీఐ కళాశాలలో అధ్యాపకులు లేక విద్యార్థులకు బోధన జరగడం లేదని సోమవారం కళాశాల విద్యార్థులు ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధ్యాపకులు, వసతులు లేక పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఐటీఐ కళాశాలలో విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి అధ్యాపకులు లేక బోధనలు సక్రమంగా జరగడం లేదని ఏబీవీపీ కన్వీనర్ అక్షర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగ సమస్యలపై శ్రద్ధ వహించడం లేదని ఆరోపించారు. త్వరలోనే ఐటీఐ కళాశాలలో అధ్యాపకుల భర్తీతోపాటు విద్యా రంగ సమస్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అధికారులు తమ భవిష్యత్ గురించి ఆలోచించి సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరుతున్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

## కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

### కలెక్టరేట్, తెలంగాణ చౌక్‌లో నిరసనలు

ఎదులాపురం, సెప్టెంబర్ 23 : కార్మికులకు అండగా ఉండాల్సిన కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటు చట్టాలను తీసుకొచ్చిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ అన్నారు. కార్మిక వ్యతిరేక లెబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త బ్లాక్ డే నిరసనలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూసీ నాయకులు ఆశన్న, పొచ్చన్న, ఆర్ సురేందర్, దర్శనాల నగేశ్, శేషరావు, రమాకాంత్, గణేశ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

### ఏఐటీయూసీ, టీయూసీఐ

ఏఐటీయూసీ, టీయూసీఐ ఆధ్వర్యంలో బ్లాక్ డేలో భాగంగా నిరసన తెలిపారు. తెలంగాణ చౌక్‌లో నల్ల జెండాలను పట్టుకుని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికులు ప్రాణత్యాగం చేసి సాధించిన చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా చేసి కార్పొరేట్ శక్తులను సంపదను కూడబెట్టేల కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజేంగుల రాజు, టీయూసీఐ ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్, సహయ కార్యదర్శి నితిన్, ఎండీ ముజీబ్, మహేందర్, ఉయికే రమేశ్, ఎండీ ఖసీం, సైఫ్ ఖాన్, రాజు పాల్గొన్నారు.